

ఉద్యోగులకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందజేస్తున్న డిప్యూటీ రీజనల్ మేనేజర్ సుచరిత

ఆర్టీసీ అభివృద్ధిలో కార్మికుల పాత్ర గొప్పది

● డిప్యూటీ రీజనల్ మేనేజర్ సుచరిత

హయత్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌ల పాత్ర గొప్పదని హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ సుచరిత అన్నారు. గురువారం హయత్‌నగర్ ఆర్టీసీ- 1 డిపోలో నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సంస్థకు అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లకు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు నగదు పురస్కారాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన లక్ష్మి ఉదయశ్రీ, నాగేంద్ర, అలివేలు, మల్లేష్, యాదయ్య, నర్సింగ్ రావులను పురస్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్, సహాయ మేనేజర్ విజయకుమారి, సత్తయ్య పాల్గొన్నారు.

పోచంపల్లి - మన్సూరాబాద్ రోడ్డును పునరుద్ధరించాలి



ఎంపీ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

హయత్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : గతంలో మన్సూరాబాద్ నుంచి పోచంపల్లి వరకు ఉన్న పాత రోడ్డును తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ గురువారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, రోడ్డు పునరుద్ధరణ కమిటీ సభ్యులు ఉపేందర్‌రెడ్డి, ఉట్టి అశోకప్ప, జ్ఞానేశ్వర్‌లు కలిసి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాత రోడ్డుకు అడ్డంగా క్రీడా అధికారులు గోడ నిర్మించారని దీంతో రాకపోకలు మూసుకుపోయాయని తెలిపారు. రోడ్డు పునరుద్ధరణతో దాదాపు 100 కాలనీలకు 50 గ్రామాలకు మేలు జరుగుతుందని, నగరానికి చేరుకోవడానికి దూరం తగ్గుతుందన్నారు. రోడ్డు నిర్మించేందుకు ఎన్ఓసీ ఇవ్వాలని క్రీడా డైరెక్టర్ వినోద్‌కుమార్‌సింగ్, క్రీడా అధికారి ప్రిన్సిపల్ సైంటిస్టు శ్రీనివాస్‌లను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రోడ్డును పునరుద్ధరించేలా తన వంతు కృషి చేస్తానని ఈటల హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.



బ్యాక్ స్కేటింగ్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం


మన్సూరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు స్కేటింగ్ క్రీడాకారులు కలకోట రాజేష్‌గుప్తా, ఉమేష్‌గుప్తా చేపట్టిన 300 కిలోమీటర్ల బ్యాక్ స్కేటింగ్ ర్యాలీని రామోజీఫిల్మ్‌సిటీ వద్ద ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. శ్రీనివాస్‌గుప్తా క్రీడాకారులిద్దరికీ శుభాకాంక్షలు తెలిపారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

కొత్తపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాలనీల డ్రైనేజీ పైప్‌లైన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను ఆదేశించారు. మోహన్‌నగర్‌లోని భారీ రిజర్వాయర్ల సమీపంలో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ల పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి డ్రైనేజీ పైప్‌లైన్ల సమస్యలు తలెత్తకుండా సాంకేతికంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైప్‌లైన్ల సామర్థ్యం, పైప్‌లైన్ల లెవెల్స్ తదితర అంశాలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రవీందర్ వర్మ, ఏఈ స్రవంతీరెడ్డి, నాయకులు తోట మహేందర్ యాదవ్, సుందర్‌నారాయణ, గట్టు మహేష్, నర్సింహ, దయాకర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వనస్థలిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. వనస్థలిపురం హిల్‌కాలనీలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ స్కూల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న రంగంలో విజయం సాధించాలన్నారు. విద్య ద్వారానే ఎంచుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో బచ్‌పన్ అకడమిక్ హైట్స్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కల్పవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి కొత్త అశోక్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురికి పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన వస్తుందని తెలిపారు. రామసాని మోహన్‌రెడ్డి, ఎంసీ యాదగిరిగౌడ్, సుధాకర్‌గౌడ్, శ్రీహరి, మల్లారెడ్డి, శ్రీనివాస్, నరేందర్, ప్రణయ్, ప్రశాంత్‌కుమార్, ఉదయ్, చరణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి భగీరథుడు కాదు

● మూసీకి పునర్జీవం, నిరుపేదలకు మెరుగైన పునరావాసం కల్పిస్తామని సీఎం మాటివ్వాలి
● అప్పుడే అన్ని పార్టీలు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తాయి
● మూసీ నిర్వాసితుల పరామర్శలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మూసీ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, కార్పొరేటర్లు భాగ్యలక్ష్మీరెడ్డి, అరుణారెడ్డి

చాదర్‌ఘాట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మూసీ పునర్జీవం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి భగీరథుడు కాదు.. అనంతగిరి కొండల్లో బాణం వేస్తే నీళ్ల బయటికి వచ్చేది కాదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, నగర మాజీ డిప్యూటీ మేయర్ జి.సుభాష్‌చందర్‌జీ, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, కొత్తకాపు అరుణారెడ్డి, పార్టీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందడి సురేందర్‌రెడ్డి, తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, నవీన్‌రెడ్డిలతో కలిసి మూసారాంబాగ్ బ్రిడ్జి నుంచి శాలివాహననగర్ వరకు ఉన్న మూసీ నిర్వాసితులను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము ఇక్కడే నివాసముంటామని, తాము ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లమంటూ పలువురు నిరుపేద కుటుంబీకులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పునర్జీవం చేసేందుకు నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల గుడిసెలు, ఇళ్లను తొలగిస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటన బాధాకరమన్నారు. ఒకవేళ మూసీనదిని నిజంగానే పునర్జీవం చేయాలనుకుంటే పునర్జీవం అనే బదులు పునర్ నిర్మాణం అనండి నది పరీవాహక ప్రాంతాన్ని కాపాడుతామని చెప్పండి. దాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏం చేయాలనుకుంటుందో ముందుగా అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి తెలియజేయండి. అనంతరం అధికార యంత్రాంగంతో మూసీ నిర్వాసితులతో అభిప్రాయాలు తీసుకోండి అంతే గానీ ఏకపక్ష నిర్ణయాలతో మూసీ గర్భంలో ఉన్న ఇళ్లను తొలగిస్తాం. కూల్చివేస్తామంటే బీజేపీ చూస్తూ ఊరుకోబోదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బహిరంగంగా ఎవరికి ఎలాంటి నష్టం కలుగకుండా నిర్ణయం తీసుకుంటామని సీఎం మాట ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 40ఏళ్లుగా మూసీ పరీవాహక ప్రాంతంలో జీవనం సాగిస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలను పునరావాసం కోసం ఎక్కడికి తరలిస్తారు. అనేది ప్రజల మధ్యకు వచ్చి తెలియజేయాలి. ప్రజలకు నమ్మకం కలిగించాలి. అందుకు గాను వంద కుటుంబాలకు ఒక అధికారిని నియమించాలి. ఇక్కడి కుటుంబీకులను ఇప్పుడున్న పరిస్థితికన్నా వందశాతం మెరుగైన పరిస్థితిలో జీవనం పునర్‌నిర్మాణం కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఆయన సూచించారు. ఇంతకన్నా మంచి సదుపాయాలతో పునరావాసం కల్పించాలి. ఈ మాట సీఎం ప్రకటిస్తే అందుకు అన్ని పార్టీలు మద్దతునిస్తాయి. ఇక ఖాళీ చేసిన స్థలాలైన మూసీ పరీవాహక ప్రాంతంలో ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయమని కూడా ప్రకటించాలన్నారు. ప్రజలు సేదతీరేలా పచ్చదనంతో తీర్చిదిద్దాలని, సీసీ కాంక్రీట్ నిర్మాణం చేయమని ప్రకటిస్తూ సీఎం మాట ఇస్తే అందుకు తాము దేనికంటే దానికి ఒప్పుకుంటామన్నారు. ప్రైవేటు పరంగా గానీ ఎట్టి పరిస్థితుల్లోను ఆకాశహర్మ్యాలు నిర్మించం. ప్రైవేటు వ్యక్తులకు అప్పగించం. ఎలాంటి దుర్వినియోగం చేయమని, ఇక్కడ బడా వ్యాపారులకు జాగాలు ఇవ్వమని, ప్రభుత్వం నిధుల కోసం అప్పుల్లో ఉందని వాటిని తీర్చేందుకు డబ్బున్నోడికి అమ్మకాలు చేయమని ప్రకటన చేయాలని కూడా సూచించారు. మూసీ నదికి ఇరువైపులా ప్రహరీ నిర్మించాలి. ఖాళీ స్థలాన్ని సుందరీకరణ పేరుతో గార్డెనింగ్ చేయాలి. అంతేగానీ గత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తీసుకున్న నిర్ణయాల తరహాల్లోనే మూసీ భూములను దారాదత్తం చేస్తారా అని ప్రశ్నించారు. సియోల్ పర్యటన ఎందుకు అక్కడకు వెళ్లి ఏం చేస్తారు. ఇక్కడ ఏం చేయాలనుకుంటున్నావో ఇక్కడ చేయి అంతేగానీ రాజస్థాన్‌కు వెళ్లి బాయి తవ్వుతా అంటే ఇసుకలో అయ్యేదేనా హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్నట్లు 25డిగ్రీల టెంపరేచర్‌ను తీసుకువస్తానని, తెలంగాణ రాష్ట్రానికి సముద్రాన్ని మళ్లిస్తాననడం అయ్యే పనా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇక కాని పనిని ఎందుకు నెత్తిన ఎత్తుకోవడం అవసరమేముంది. అనవసరంగా రాజకీయంగా మాంత్రికంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సీఎంకు సూచించారు. కమిట్‌మెంట్‌తో ఉంటే తెలంగాణ ప్రభుత్వం చేపట్టే మూసీ ప్రాజెక్ట్‌కు అన్నిపార్టీలు సహకరిస్తాయని ఆయన వెల్లడించారు. ఏది ఏమైనా మూసీ నిర్వాసితులకు బీజేపీ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

లారీ పార్కింగ్ టెండర్ పేరిట డబ్బులు వసూలు చేస్తే ఊరుకోం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఇసుక లారీల ఉచిత పార్కింగ్‌కు అడ్డాగా కేటాయించిన స్థలానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టెండరు వేసి డబ్బులు వసూలు చేసేందుకు చూస్తోందని, ఇలా చేస్తే తాము చూస్తూ ఊరుకోమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. టెండర్ ప్రక్రియను నిరసిస్తూ ఇసుక లారీల అడ్డా సంఘం విన్నపం మేరకు గురువారం ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గతంలో ఇసుక లారీ పార్కింగ్ ప్రధాన రోడ్డు వద్ద ఉండడంతో స్థానికుల ఇబ్బందుల మేరకు నాటి మంత్రి కేటీఆర్ ఇసుక లారీలకు ఇబ్బందులు తలెత్తకుండా లోపల ఉన్నటువంటి విశాలమైన స్థలంలోకి మార్చారన్నారు. కానీ నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక లారీ సంఘం వారికి ఇబ్బందులు తలెత్తేలా టెండర్లు వేసి డబ్బులు వసూలు చేయాలనుకోవడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లారీ అసోసియేషన్ సభ్యులు భయాందోళన చెందరాదని, మీకు మేము అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్యామ మల్లేష్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, ఇసుకలారీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదగిరిగౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, ఆటోనగర్ న్యూఇసుక లారీల అడ్డా అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సందీప్ రెడ్డి, దామోదర్‌గౌడ్, మర్రి వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

టపాసుల దుకాణాదారులు నిబంధనలను పాటించాలి



● ఖాళీ ప్రదేశాల్లోనే దుకాణాలకు అనుమతి
● టపాసులు అక్రమంగా నిల్వచేస్తే చర్యలు
● మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి సారెడ్డి అంజిరెడ్డి

సైదాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి సారెడ్డి అంజిరెడ్డి కోరారు. ప్రజలకు ఇబ్బందిలేని, నివాసాలకు దూరంగా ఖాళీ ప్రదేశాలలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. స్టాళ్ల ఏర్పాటుకు దుకాణాదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారని, వాటిని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామని వివరించారు. శాశ్వత ప్రాతిపదికన అనుమతి తీసుకున్న దుకాణాలు నిబంధనల ప్రకారం 1500కిలోలు మాత్రమే ఉంచాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి తెలియజేయడంతో పాటు ప్రాథమిక చర్యలు చేపట్టాలని సూచించారు. దీపావళి నేపథ్యంలో దుకాణాల ఏర్పాటులో నిబంధనలు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆయన ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఇంటర్వ్యూ

దుకాణాల ఏర్పాటులో ఏ నిబంధనలు పాటించాలి?

ఇళ్లు ఫంక్షన్‌హాళ్లు, పెట్రోల్‌బంకులు, ఇతరత్రా జనసంచారం రద్దీగా ఉండే ప్రాంతాల్లో టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతిలేదు. కాలనీలు, బస్తీల్లో ఖాళీ ప్రదేశాలు, ఆటస్థలాలు, ప్రజలకు ఇబ్బందిలేని, ప్రాణనష్టంలేని ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకునేందుకు మాత్రమే అనుమతి ఇస్తున్నాం. దుకాణం వద్ద పెద్ద అక్షరాలతో పొగతాగరాదు అని బోర్డు ఏర్పాటుచేయాలి. టపాసులు విడిగా విక్రయించరాదు. ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు పాటించాలి.

ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిని సంప్రదించాలి?

ఏ చిన్న ప్రమాదం జరిగినట్లు తెలిసినా టోల్‌ఫ్రీ నెంబరు 101కు గానీ మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం కార్యాలయంలో 24గంటలు పనిచేసే నంబరు 8712699414, 040-23449213గానీ, తన నెంబరు 8712699415కు గానీ ఫోన్ చేస్తే నిమిషాలలో అగ్నిమాపక సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుంటాం. ఆ లోపు నీళ్ల చల్లడం, ఇసుక వేసి ఆపేందుకు ప్రయత్నించాలి. తదుపరి నివారణ కార్యక్రమం పూర్తి చేస్తాం.

దుకాణాల ఏర్పాటులో ఎలాంటి విధివిధానాలు అవలంబించాలి?

టపాకాయల దుకాణాల ఏర్పాటుకు వెబ్‌సైట్‌లో టీఎస్ఎఫ్ఐఆర్ఈ.సీజీజీ.జీఓవీ.ఇన్ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు ఏదైనా గుర్తింపు పత్రం, గతంలో తీసుకున్న ఫైర్ అనుమతి, వ్యాపారి పాస్‌పోర్టు ఫొటో, నిర్ణీత ఫీజు వివరాలతో దరఖాస్తుకు జతచేయాలి. అంతేగాకుండా పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్‌శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

మీ పరిధిలో ఏయే ప్రాంతాల వారు దరఖాస్తు చేసుకోవచ్చు?

సైదాబాద్, ఐఎస్‌సదన్, సంతోష్‌నగర్, మాదన్నపేట, మలక్‌పేట, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే మా దగ్గర అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

దుకాణాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

రేకులషెడ్లు ఏర్పాటు చేసుకోవాలి. టపాసుల దుకాణంలో అలంకరణకు కాటన్ క్లాత్‌నే వినియోగించుకోవాలి. డ్రమ్ముల్లో నీటిని నింపిఉంచుకోవాలి. కాస్త ఇసుక కూడా దగ్గర పెట్టుకుంటే మంచిది. ఒక్కో దుకాణం మధ్య ఆరు అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పక్కదానికి అంటుకోకుండా ఆర్పేందుకు ఉపయోగపడుతుంది. అగ్గిపెట్టెలు, ఇతరత్రా మంటలు వచ్చే వస్తువులు దగ్గర ఉంచుకోకూడదు.

టపాకాయలు కాల్చేవారు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు ఏమిటి?

విశాల ప్రదేశాలలో, జనసంచారం లేని ప్రాంతాలలో మాత్రమే బాణసంచా కాల్చాలి. పెద్దలు దగ్గరుండి పిల్లలతో టపాసులు కాల్పించాలి. అనుమతి పొందినవారు మాత్రమే బాణసంచా విక్రయించాలి. మిగిలిన వారెవ్వరు విక్రయించడానికి అనుమతిలేదు. ఎవరైనా దుకాణాలు, జన సమూహాల వద్ద విక్రయిస్తే ఫిర్యాదు చేయండి. తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీచేశాం. 18సంవత్సరాలు పైబడిన వారితోనే అమ్మకాలు జరపాలి. దుకాణం వద్ద టపాసులు కాల్చకూడదు.

అక్రమ నిల్వలపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు?

టపాసులను అక్రమంగా నిల్వచేస్తే చర్యలు తీసుకుంటాం. అనుమతి ఉన్నవారు మాత్రమే విక్రయించాలి. 100 డెసిబుల్ శబ్దాలు, ఆపై వచ్చే బాంబులను విక్రయించరాదు. ఇక దుకాణంలో అగ్గిపెట్టెలు(కలర్ మ్యాచెస్), ఉల్లిగడ్డ బాంబులు ఉంచరాదు. ప్రతి షాపులో రేట్ల పట్టిక ఏర్పాటు చేసి, వినియోగదారులకు బిల్లులు ఇవ్వాలి.

అల్మాస్‌గూడ-గుర్రంగూడ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయండి

● ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డికి బడంగ్‌పేట్ మేయర్ వినతి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వరకు గల రహదారి విస్తరణకు సహకరించాల్సిందిగా మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో పాటు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా రోడ్డు విస్తరణకు ఆర్అండ్‌బీ నిధుల నుంచి రూ.5కోట్లు మంజూరు చేయాలని మేయర్ మంత్రిని కోరారు. గతంలో అల్మాస్‌గూడ వైఎస్ఆర్ పార్క్ నుంచి శివాలయం మలుపు వరకు కొంత మేర విస్తరణ చేపట్టినప్పటికీ అనంతరం పలు తవ్వకాల కారణంగా మళ్లీ ఎప్పటిలాగే తయారయిందని ఆమె చెప్పారు. శివాల యం మలుపు నుంచి గుర్రంగూడ వరకు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్నదని ఆమె అన్నారు. సదరు రహదారి మొత్తాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆమె మంత్రిని కోరారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి సానుకూలంగా స్పందించినట్టు మేయర్ చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం



మనీష

హయత్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా పండగ కోసమని మనీష(23) సూర్యాపేట నుంచి హయత్‌నగర్‌లోని సీఎస్ఆర్‌కాలనీలో ఉండే పుట్టింటికి వచ్చింది. మంగళవారం ఉదయం 9గంటలకు మనీష ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి మంజుల తెలిసిన బంధువుల వద్ద చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం ఉదయం మంజుల హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో తన కూతురు కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. మనీషకు 8 నెలల క్రితం సూర్యాపేటకు చెందిన అజయ్ అనే యువకుడితో వివాహం జరిగింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూగ జీవాల ఉసురుతీసిన ఆగంతకులు

● న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



దుండగులు చంపేసిన మేకలు, కోళ్లు

సరూర్‌నగర్ : కసాయిలుగా మారిన కొందరు కర్కశులు మూగ జీవాలను దారుణంగా చంపేశారు. దాంతో వాటి యజమానులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని సాయిచైతన్య కాలనీకి చెందిన వి.నర్సింహ కుటుంబ సభ్యులు మేకలు, కోళ్లు పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. రోజూ రాత్రి సమయంలో ఇంటి సమీపంలోని షెడ్డులో వాటిని పెట్టేవారు. కాగా బుధవారం రాత్రి సైతం ఎప్పటిలాగే షెడ్డులో వాటిని పెట్టి యజమాని కుటుంబ సభ్యులు ఇంట్లో పడుకోగా, అర్ధరాత్రి దాటింతర్వాత గుర్తు తెలియని దుండగులు షెడ్డులోకి ప్రవేశించి దాదాపు 15కి పైగా మేకలు, 50కి పైగా కోళ్లను కత్తులతో దారుణంగా నరికి చంపేశారు. ఉదయం లేచి చూసే సరికి తమ మూగ జీవాలు విగత జీవులుగా పడి ఉండడంతో యజమాని నర్సింహతో పాటు ఆయన కుటుంబ సభ్యులు లబోదిబోమంటూ రోదించారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు జీవనాధారంగా ఉన్న మూగ జీవాలు చనిపోవడంతో అప్పులపాలయ్యే దుస్థితి తలెత్తిందని, తమకు తగిన న్యాయం చేయాలని వారు కోరారు.

పారామెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పారామెడికల్ కాలేజీల్లో పారామెడికల్ డిప్లొమా కోర్సుల అడ్మిషన్ల కోసం దరఖాస్తులు సమర్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని, అన్ని సర్టిఫికెట్లు జతపరిచి వంద రూపాయల నగదు చెల్లించి ప్యాట్నీ సెంటర్‌లోని హరిహర కళాభవన్ 4వ అంతస్తులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తెలంగాణ మెడికల్ బోర్డు వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in నుంచి దరఖాస్తులను పొందవచ్చునని, వీటిని ఈనెల 30వ తేదీలోగా సమర్పించాలని కోరారు.

నేడు, రేపు ఏఎన్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన వసతి గృహాల్లో ఏఎన్ఎం (ఔట్‌సోర్సింగ్) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 25, 26 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో పరిశీలిస్తున్నటు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గత ఏడాది హైదరాబాద్ జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో ఏఎన్ఎం పోస్టులపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. అభ్యర్థుల నివాసం, కులం, స్టడీ, బోనఫైడ్, విద్యార్హతలు తదితర సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు.

గుర్తు తెలియని మహిళ హత్య కేసులో

నిందితుడికి జీవిత ఖైదు



షేక్ బడేమియా

అబ్దుల్లాపూర్‌మెట్ : గుర్తు తెలియని మహిళను రాయితో బాది హత్యకు పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 9వ అదనపు సెషన్‌కోర్టు తీర్పునిచ్చింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యపేట జిల్లా మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన షేక్ బడేమియా అలియాస్ రఫిక్(24) దొంగతనాలకు పాల్పడుతూ జులాయిగా తిరుగుతాడు. 2021 నవంబర్ 12న నగర శివారు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు వద్ద ఓ గుర్తుతెలియని(30-35) వయస్సు గల మహిళను బండరాయితో దాడిచేసి హత్యచేశాడు. అనంతరం ఆమె వద్ద ఉన్న రూ.500 తీసుకుని మృతదేహాన్ని ఓఆర్ఆర్ గండిచెరువు సర్వీసు రోడ్డులోని కత్వాలో పడేసి అక్కడి నుంచి పారిపోయాడు. అదే రోజు కత్వాలో మృతదేహం తేలియాడుతుందని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దాంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

చింతపల్లిలో పట్టుబడటంతో..

షేక్ బడేమియా అలియాస్ రఫిక్‌పై నల్గొండ జిల్లాలోని చింతపల్లి పోలీస్‌స్టేషన్‌తో పాటు పలు స్టేషన్లలో హత్యానేరం కేసులు ఉన్నాయి. 2022లో చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఓ కేసులో బడేమియా పోలీసులకు పట్టుబడ్డాడు. అనుమానంతో స్టేషన్‌కు తరలించి విచారించడంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మహిళను హత్య చేసినట్లు అంగీకరించాడు. అనంతరం నిందితుడిని జైలుకు పంపించారు. కేసుకు సంబంధించిన పూర్తి సాక్ష్యాధారాలతో పోలీసులు ఛార్జ్‌షీటు దాఖలు చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా 9వ అదనపు సెషన్‌కోర్టు న్యాయమూర్తి హరీష కేసు పూర్వపరాలు పరిశీలించి నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

● బాధితురాలికి నష్టపరిహారం

రంగారెడ్డి కోర్టులు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో అత్యాచారం చేసిన నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ. 3లక్షలు నష్టపరిహారం చెల్లించాలని పదమూడవ అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పుచెప్పింది. పీపీ మంజులాదేవి కథనం ప్రకారం మొయినాబాద్‌కు చెందిన విద్యార్థి కాశీవిశ్వనాథ్(29) అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి ఐదు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పిన నిందితుడు ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు అతన్ని పెళ్లి చేసుకోమని కోరగా నిరాకరించాడు. దీంతో బాధితురాలు మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపి సాక్ష్యాధారాలతో సహా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పదమూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వాణి నిందితుడికి 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ. 3లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పుచెప్పారు.